క్లుప్తంగా

నేడు జగన్ పుట్టిన రోజు వేడుకలు

కంకిపాడు: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఈనెల 21న నియోజకవర్గం వ్యాప్తంగా నిర్వహించాలని పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉయ్యూరు ప్రధాన సెంటరులో ఉదయం 8.30 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. 10 గంటలకు కంకిపాడు పార్టీ కార్యాలయంలో దుప్పట్ల పంపిణీ, 11 గంటలకు కానూరులో పేదలకు దుప్పట్లు పంపిణీ, సాయంత్రం 6 గంటలకు గంగూరు, 7 గంటలకు కాటూరు, 8 గంటలకు కానూరు సనత్ నగర్‌లో వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు వేడుకల్లో భాగస్వాములు కావాలని కోరారు.

సామూహిక కుంకుమార్చన

దావాజిగూడెం (గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ధనుర్మాస మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. తొలుత శ్రీగోదాదేవి సమేత శ్రీకృష్ణస్వామివార్లను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరణ చేసి, విశేష అర్చనలు జరిపారు. ఆలయ అర్చకుడు ఎస్. రామాచార్యులు నేతృత్వంలో పెద్ద సంఖ్యలో భక్తులు శాస్త్రోక్తంగా కుంకుమార్చనలు చేశారు.

హుండీ కానుకల లెక్కింపు



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మకు హుండీల ద్వారా కానుకల రూపంలో రూ.3.86 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని హుండీలను శుక్రవారం దేవదాయశాఖాధికారి పర్యవేక్షణలో లెక్కించారు. ప్రియాంక మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలోని హుండీల్లో భక్తులు అమ్మవార్లకు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని లెక్కించినట్లు తెలిపారు. మొత్తం 64 రోజులకు ఈ ఆదాయం వచ్చిందన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుల బైండోవర్

గన్నవరం: అనధికార మద్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు వెంకటశివయ్య బెల్టుషాపు నిర్వాహకులను హెచ్చరించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు పలువురు బెల్టుషాపు నిర్వాహకులను శుక్రవారం బైండోవర్ చేసి తహసీల్దారు ఎదుట హాజరుపరిచారు. తహసీల్దారు మాట్లాడుతూ.. బెల్టుషాపు నిర్వాహకులు మరోసారి మద్యం విక్రయాలు జరుపుతూ పట్టుబడితే రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తామన్నారు. బైండోవర్ అయిన వ్యక్తుల నుంచి పూచికత్తుగా సెక్యూరిటీ బాండ్లు తీసుకున్నట్లు తెలిపారు.

అమిత్‌షా వ్యాఖ్యలకు నిరసన

గన్నవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్‌ను అవమానించే విధంగా వ్యాఖ్యలు చేసిన హోం మంత్రి అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వాన్ని తక్షణం రద్దు చేయాలని దళిత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఆగిరిపల్లి రోడ్డులోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద కుల వివక్ష పోరాట సమితి, దళిత ఐక్య కార్యచరణ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. కేవీపీఎస్ నేత మల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను కించపరిచే విధంగా అమిత్‌షా వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. ఈ వ్యాఖ్యలను ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. దళిత సంఘాల నేతలు మిరప నాగేశ్వరరావు, వీపీ విజయ్‌కుమార్, బాబూరావు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానకరంగా మాట్లాడిన కేంద్రమంత్రి అమిత్‌షాను తక్షణమే కేంద్ర మంత్రి వర్గం నుంచి బర్తరఫ్ చేయాలని పలువురు డిమాండ్ చేశారు. బాపులపాడు మండలం బండారుగూడెంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. కేంద్ర మంత్రి అమిత్‌షా చిత్రపటాన్ని దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. సీపీఎం నాయకుడు బర్రె లెనిన్, డీవైఎఫ్ నాయకుడు కొల్లాబత్తిన నాగేంద్ర, కాంగ్రెస్ నాయకులు మాదు కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కుర్చీ కోసం కుమ్ములాట

- శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయానికి నియామకం కాని ధర్మకర్తల మండలి
- చైర్మన్ పదవికై గ్రూపుల పోరు
- మండలి లేకుండానే గత దసరా ఉత్సవాల నిర్వహణ
- రానున్న సంక్రాంతి ఉత్సవాలూ ఇదే తరహా అని అనుమానాలు



రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం

రామవరప్పాడు: భక్తుల కొంగు బంగారమైన శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మకు ఉమ్మడి కృష్ణా జిల్లాల్లో వేల సంఖ్యలో భక్తులు ఉన్నారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో ఈ ఆలయం ఉంది. ప్రతి సంవత్సరం పెద్ద పండుగలైనా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, సంక్రాంతి సంబరాలను ఆలయంలో అత్యంత ఘనంగా నిర్వహించడం ఆనవాయితీ. అయితే ఆలయానికి ధర్మకర్తల మండలిని నియమించకపోవడం వల్ల ఉత్సవాలపై ప్రభావం పడుతోందని భక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గత దసరా ఉత్సవాల సందర్భంలో జరిగిన పరిస్థితులు పునరావృతం అవుతాయేమోనన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా సంక్రాంతి ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్ల అంశంపై ఆలయంలో ఏర్పాటు చేసిన గ్రామ సభకు అందరికీ ఆహ్వానాలు అందకపోవడం ఇందుకు ఉదాహరణగా చెబుతున్నారు.

భక్తులలో ఉత్కంఠ..

రాజకీయాలకు అతీతంగా అమ్మవారి ఉత్సవాలను రామవరప్పాడు, ప్రసాదంపాడు గ్రామస్తులు, దాతల సహాయ, సహకారాలతో కనుల పండువగా నిర్వహిస్తారు. ఈ సారి కూడా ఆరు రోజుల పాటు జరిగే సంక్రాంతి ఉత్సవాల నిర్వహణలో అందరిలో సందేహాలు నెలకొన్నాయి. ఆలయ అధికారులతో కలిసి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు బాధ్యతలు తీసుకుని ఉత్సవాలను సమన్వయంతో ఘనంగా నిర్వహించేవారు.

కారణం ఇదీ..

ప్రస్తుతం ఆలయానికి ధర్మకర్తల మండలి నియామకం జరగకపోవడం, ఆలయ చైర్మన్ పదవీ కోసం టీడీపీ నాయకుల్లో జరుగుతున్న అంతర్యుద్ధంతో ఈ అనుమానాలు బలపడుతున్నాయి. పైగా ఆలయానికి నూతన కార్యనిర్వహణాధికారిగా పి.ప్రియాంక బాధ్యతలు స్వీకరించారు. ఆనవాయితీగా వస్తున్న గ్రామ పద్ధతులు, ఉత్సవ నిర్వహణపై అవగాహన లేకపోవడం మరో కారణంగా నిలుస్తోంది.

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఇలా..

గత దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో కొందరు టీడీపీ నాయకుల తీరుతో ఇబ్బందులు తలెత్తాయని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. మరో వైపు ఆలయ అధికారుల పర్యవేక్షణ, అవగాహన లోపంతో అబాసుపాలయ్యారు. దసరా ఉత్సవాలు ప్రతి ఏడాది మాదిరి ఘనంగా జరగకపోవడంతో భక్తుల ఆగ్రహానికి గురి కావాల్సి వచ్చింది. ఆలయంలో ప్రతి విషయంలో కొందరు టీడీపీ నాయకుల కర్ర పెత్తనం ఎక్కువవడంతో ఆలయ అధికారులు కూడా మిన్నకుండిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. దసరా ఉత్సవాల నిర్వహణలో ముందుకొచ్చిన దాతలకు కొందరు టీడీపీ నాయకులు అడ్డు తగలడం వివాదస్పదమైంది.

ఈ సంక్రాంతికి కూడా..

ప్రస్తుతం సంక్రాంతి ఉత్సవాల్లో కూడా దాతలను అడ్డుకుంటారనే ప్రచారం జరుగుతోంది. దాతల భాగస్వామ్యంతో పని లేదని మా ఎమ్మెల్యేనే చూసుకుంటారని టీడీపీ నాయకులు ఏకపక్షంగా వ్యవహరించడం వివాదాలకు దారి తీస్తోంది. ఆలయంలో నిర్వహించిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు పోటీగా ఆలయ చైర్మన్ రేసులో ఉన్న ఓ వ్యక్తి తన ప్రాభ్యల్యాన్ని చాటుకునేందుకు కొందరు టీడీపీ నాయకులను కలుపుకుని రాజుల బజారులో దసరా ఉత్సవాలు 9 రోజుల పాటు జరపడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఆలయ ప్రతిష్ఠ దెబ్బతీయడానికి కావాలనే ఈ కార్యక్రమం నిర్వహించారని పలువురు విమర్శించారు. గ్రామ పద్ధతులు, ఆనవాయితీతో పని లేకుండా ఈ సంక్రాంతి ఉత్సవాలను కూడా ఇదే మాదిరిగా నిర్వహిస్తారేమోనంటూ పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

> **ఆలయ ప్రతిష్ట కాపాడాలి**
>
> ఏది ఏమైనా ఆలయ ప్రతిష్ఠ కాపాడేలా, రాజకీయాలకు అతీతంగా సంక్రాంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి సహకరించాలని ఇరు గ్రామస్తులు, భక్తులు, గ్రామ పెద్దలు కోరుతున్నారు.

ఎమ్మెల్యేకు తలనొప్పిగా..

చైర్మన్ ఎంపిక విషయంలో గ్రామ టీడీపీ ఏకపక్ష నిర్ణయం తీసుకోకపోవడంతో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు తలనొప్పిగా మారింది. దీంతో ఎవరికి వారు చైర్మన్ పదవి మాకు కావాలంటే మాకు కావాలంటూ ఎమ్మెల్యే చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఎటూ తేల్చక సాగదీస్తున్నారు.

కుర్చీ కోసం రెండు వర్గాల పట్టు..



ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కుర్చీ కోసం టీడీపీలో రెండు వర్గాల నాయకులు పట్టుపడుతున్నారు. ప్రస్తుతం ఆలయ చైర్మన్ రేసులో తంబాబత్తుల క్రాంతికుమార్, మత్తె రాధా కుమార్, క్లోపల్లి సాయిరామరాజు, పట్టపు చంటి పేర్లు వినిపిస్తున్నాయి. టీడీపీలోనే రెండు వర్గాలు ఉండటంతో ఎవరి వర్గం వారు చైర్మన్ పదవి కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరి మధ్య అంతర్యుద్ధం కాస్తా బజారున పడుతోంది. ఇటీవల చైర్మన్ రేసులో ఉన్న క్లోపల్లి సాయి రామరాజు, పట్టపు చంటిలు చైర్మన్ ఎంపిక విషయంలో బహిరంగంగా ఒకరినొకరు విమర్శించుకున్నారు. ఈ గొడవ కారణంగానే ఆలయంలో జరిగిన దసరా ఉత్సవాలకు పోటీగా ముందెన్నడూ లేని విధంగా రాజుల బజారులో శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారని సొంత పార్టీవారే చెబుతున్నారు.

ఆత్మీయ కలయిక



గన్నవరం విమానాశ్రయంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.ప్రణీత్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ముందస్తుగా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. – కంకిపాడు

క్రీడలతోనే సంపూర్ణ వికాసం



పెనమలూరు: క్రీడలతోనే విద్యార్థులకు సంపూర్ణ వికాసం చేకూరుతుందని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ డెప్యూటీ డైరెక్టర్ ఎస్‌వీ రమణ అన్నారు. కానూరు సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలలో శుక్రవారం 34వ వార్షిక క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రసంగించారు. వ్యాయామం, క్రీడల ద్వారా విద్యార్థులకు శారీరక, మానసిక వికాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో పాల్గొనేలా పిల్లలను తల్లితండ్రులు ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. గెలిచిన పెన్నా జట్టుకు కప్పు అందజేశారు. సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎం.రాజయ్య, సంయుక్త కార్యదర్శి నిమ్మగడ్డ లలితప్రసాద్, ఉపాధ్యక్షుడు నాగభూషణం, పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ, ప్రిన్సిపాల్ మనోజ్‌కర్మాకర్, వైస్ ప్రిన్సిపాల్ సాయికృష్ణ, తల్లితండ్రులు పాల్గొన్నారు.

పరిశ్రమలు రిజిస్ట్రేషన్ చేసుకుంటే మేలు

ఎన్ఎస్ఐసీ బ్రాంచి మేనేజర్ ఆర్‌జేఎస్‌వీ రామారావు



మున్సిపల్ కమినర్‌కు చెక్కు అందజేస్తున్న జేఆర్‌డీ టాటా ఎస్టేట్ పాలక వర్గ సభ్యులు

పెనమలూరు: పరిశ్రమలను రిజిస్ట్రేషన్ తప్పక చేసుకోవాలని, దీని వలన అనేక లాభాలు ఉంటాయని జాతీయ చిన్నతరహా పరిశ్రమల కార్పొరేషన్ (ఎన్ఎస్ఐసీ) బ్రాంచి మేనేజర్ ఆర్‌జేఎస్‌వీ రామారావు వివరించారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఉన్న జేఆర్‌డీ టాటా ఐలా సర్వీసెస్ సొసైటీ సర్వసభ్య సమావేశం శుక్రవారం జేఆర్‌డీ టాటా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తాడిగడప మున్సిపాలిటీకి పన్నుల రూపేణా అందించాల్సిన వాటా రూ.10,34,523 చెక్కును తాడిగడప కమిషనర్ భవానిప్రసాద్‌కు అందజేశారు. ఏపీఐఐసీ జనరల్ మేనేజర్ కె.బాబ్జీ, జేఆర్‌డీ టాటా ఐలా కమిషనర్ డీవీఎస్ ఎస్.జ్యోత్స్న మాట్లాడుతూ జేఆర్‌డీ టాటా ఎస్టేట్ పరిధిలో ట్రాఫిక్ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. దీనికి అందరి సహకారం కావాలని సూచించారు. జేఆర్‌డీ టాటా ఎస్టేట్‌లో భద్రత పెంచటానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. జేఆర్‌డీ టాటా ఎస్టేట్ అధ్యక్ష, కార్యదర్శులు తాతినేని వినోద్‌బాబు, తాడిశెట్టి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టెక్నాలజీకి అనుగుణంగా సిలబస్ మెరుగుపర్చాలి

రజతోత్సవ సభలో పూర్వవిద్యార్థులు



వీఆర్‌లో పూర్వ విద్యార్థులు

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో శుక్రవారం 1999 బ్యాచ్ రజతోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి హైదరాబాద్‌కు చెందిన సినోప్సిస్ సీనియర్ డైరెక్టర్ కె.నరేంద్ర మాట్లాడుతూ సెమీకండక్టర్ పరిశ్రమలో భారత్ ముందంజలో ఉందన్నారు. ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థుల సిలబస్ మెరుగుపర్చాలని సూచించారు. పలువురు ప్రముఖులు వీరరాఘవరావు (ఐఏఎస్), పవర్‌మెక్ ప్రాజెక్టు సీఈవో సజ్జా కిషోర్‌బాబు, తానా మాజీ అధ్యక్షుడు నన్నపనేని మోహన్ మాట్లాడుతూ వీఆర్ సిద్ధార్థలో చదివిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఉన్నత స్థానాల్లో ఉన్నారని అన్నారు. ప్రస్తుతం కాలేజీలో చదువుతున్న విద్యార్థులను పూర్వ విద్యార్థులు ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఉల్లాసంగా..ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ అధ్యక్షుడు ఎం.రాజయ్య, వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ప్రో వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ ఏవీ.రత్నప్రసాద్, పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పి.రవికుమార్, జానకిరామ్‌ప్రసాద్, పలువురు పాల్గొన్నారు.

పశువుల షెడ్ల పరిశీలన



పశువుల షెడ్డును పరిశీలిస్తున్న ఎంపీడీఓ విగ్గిన్స్

విజయవాడరూరల్: విజయవాడ రూరల్ మండలానికి 33 పశువుల షెడ్లు మంజూరైనట్టు ఎంపీడీఓ బి.విగ్గిన్స్ తెలిపారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిర్మిస్తున్న పశువుల షెడ్లను శుక్రవారం ఎంపీడీఓ బి.విగ్గిన్స్ పరిశీలించారు. అంబాపురం, నున్న, పి.నైనవరం, పాతపాడు గ్రామాల్లో ఆయన షెడ్ల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పశువుల షెడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద ఆర్థిక సహాయం చేస్తోందన్నారు. రెండు పశువులు ఉంటే రూ.లక్షా 15 వేలు, నాలుగు పశువులు ఉంటే రూ.లక్షా 88 వేలు, ఆరు పశువులు ఉంటే రూ.రెండు లక్షల 30 వేల చొప్పున ఆర్థిక సహాయం అందుతుందన్నారు. లబ్ధిదారులు పది శాతం శ్రమ దానం ద్వారా భరించాల్సి ఉంటుందని తెలిపారు. సన్న, చిన్న కారు రైతులకుతో పాటు ఎస్సీ, ఎస్టీ రైతులు ఆర్థిక సహాయం పొందటానికి అర్హులన్నారు. ఆసక్తి గల రైతులు పశుసంవర్ధక శాఖ అధికారి కార్యాలయం నుంచి దరఖాస్తులను పంపాలని సూచించారు. నున్న, పాతపాడు, పి.నైనవరం, కొత్తూరు తాడేపల్లి, అంబాపురం, రాయనపాడు, పైడూరుపాడు, జక్కంపూడి, నిడమానూరు, ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాల్లో పశువుల షెడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. ఇంజినీరింగ్ కన్సల్‌టెంట్ వి.శ్రీనివాసరావు, టి.ఎ కిరణ్మయి ఉన్నారు.


విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వర్ల

గన్నవరం: స్థానిక వీఎస్.సెయింట్‌జాన్స్ మాధ్యమికోన్నత పాఠశాల 55వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తొలుత వేడుకలను పామర్రు ఎమ్మెల్యే, పూర్వ విద్యార్థి వర్ల కుమార్‌రాజా జ్యోతి ప్రజ్వాలన చేసి ప్రారంభించారు. అనంతరం ముఖ్యఅతిథి స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేతుల మీదుగా విద్యార్థులకు ఉత్తీర్ణత పట్టాలను పంపిణీ చేశారు. ఉత్తమ విద్యార్థులకు బంగారు పతకాలను అందజేశారు. ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడుతున్న సెయింట్‌జాన్స్ యాజమాన్యాన్ని అభినందించారు. అనంతరం ఎల్‌కేజీ నుంచి పదో తరగతి విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ సంతోస్‌కుమార్ అధ్యక్షతన పూర్వ ప్రిన్సిపాల్స్ బ్రదర్ బాలశౌరి, థామస్, సీనియర్ బ్రదర్ జిమ్మికురియోకోస్, భల్లా జోసఫ్, జయబాలన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలపై అవగాహన



ఉయ్యూరు: ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలు ప్రజలు వినియోగించుకోవాలని ఆర్టీసీ ఉయ్యూరు డిపో మేనేజర్ కేఎస్‌ఆర్‌కే ప్రసాద్ కోరారు. డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా ఉయ్యూరు డిపోలో శుక్రవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. డీఎం ప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తుందన్నారు. పట్టణాల్లో 10 కిలోమీటర్ల పరిధిలో డోర్ డెలివరీ సదుపాయం అందుబాటులో ఉందన్నారు. ఉద్యోగులు, వ్యాపారులు, సామాజిక వేత్తలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. డోర్ డెలివరీ విధానంపై ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.


పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని వినతి



గన్నవరం రూరల్: పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని రైతులు అధికారులను కోరారు. శుక్రవారం మండలంలోని రామచంద్రాపురంలో రెవెన్యూ సదస్సు తహసీల్దార్ కేవీ శివయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ పట్టా భూములను రిజిస్ట్రేషన్ కాకుండా నిషేధిత ఆస్తుల జాబితాలో ఉంచారని, వారసత్వంగా సాగు చేస్తున్న భూములకు పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. సదస్సులో 7 అర్జీలను రైతులు అందజేశారు. వీటిని పరిష్కరిస్తామని తహసీల్దార్ రైతులకు హామీ ఇచ్చారు. సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాసరావు, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: మండలంలోని నెప్పల్లి గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మండవ ప్రగతి నేతృత్వంలో రెవెన్యూ అధికారులు భూ సమస్యలు, రెవెన్యూ సేవలపై అర్జీలు స్వీకరించారు. భూ సమస్యల పరిష్కారానికి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. వీఆర్‌ఓ రఘురాంప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు సింగపూర్ రెడ్‌క్రాస్ వితరణ



హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు బాధితులకు అండగా ఉంటామని సింగపూర్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి సత్య అన్నారు. స్థానిక ఏలూరురోడ్డులో ఇటీవల సంభవించిన రామిలేరు వరద బాధితులకు సింగపూర్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో దుప్పట్లు, దోమతెరలు, టవల్స్ ఉచితంగా పంపిణీ చేశారు. కరోనా విపత్కర సమయంలోనూ సింగపూర్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్‌కు ఆక్సిజన్ కాన్సన్ట్రేటర్లు, మెడికల్ కిట్లను సరఫరా చేసినట్లు సత్య చెప్పారు. రెడ్‌క్రాస్ ఏపీ కోఆర్డినేటర్ బీవీఎస్ కుమార్, ఏలూరు శాఖ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి, పెదపాడు తహసీల్దార్ కృష్ణజ్యోతి పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



గన్నవరం రూరల్: మండలంలోని సావరగూడెం, ముస్తాబాద, సూరంపల్లి, పురుషోత్తపట్నం, కొండపావులూరు గ్రామాల్లో శుక్రవారం జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి పర్యటించారు. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. వారి ఆవేదన తెలుసుకున్నారు. వారం రోజులుగా కోసిన ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నామని, టార్పాలిన్‌లకు అద్దెలు, కూలీ భారంగా మారాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతుల ఇబ్బందులు గమనించి రెవెన్యూ, వ్యవసాయ శాఖతో సర్వే చేయించి వారికి పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు అధికారులకు వినతి పత్రాలు అందజేశామన్నారు.